ప్రజాశక్తి
సోమవారం 28 నవంబరు 2022
5
శ్రీకాకుళం



30న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

జిల్లా ప్రజాపరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 30న నిర్వహిస్తున్నట్లు జెడ్‌పి సిఇఒ రావాడ వెంకటరామన్ ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్‌పి సమావేశ మందిరంలో ఉదయం 10గంటలకు స్థాయీ సంఘాల సమావేశం ప్రారంభం కానుందని తెలిపారు. ఉదయం 10గంటలకు 6వ స్థాయీ, 11గంటలకు 3వ స్థాయీ, మధ్యాహ్నం 12గంటలకు 5వ స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు 2వ, 3గంటలకు 4వ, 4గంటలకు 7వ, 5గంటలకు 1వ స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయతో పాటు స్థాయీ సంఘాల చైర్మన్లు, జెడ్‌పిటిసి సభ్యులు హాజరు కానున్నారని తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమావేశాలకు అభివృద్ధి నివేదికలతో హాజరు కావాలని ఆయన కోరారు.

గృహ నిర్మాణాలు కష్టమే..?



- లక్ష్యం 81 వేల ఇళ్లు
- పూర్తవుతాయని అనుకున్నది 66 వేలు
- పూర్తయింది 12,859
- పెరిగిన ధరలతో లబ్ధిదారులకు ఇబ్బందులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

నవరత్నాలు.. పేదలందరికీ ఇళ్లు ఫేజ్-1 పనులు ఆగుతూ.. సాగు తున్నాయి. ఇప్పటికీ చాలామంది. ఇళ్ల నిర్మాణ పనులే ప్రారంభించలేదు. జనావాసాలకు దూరంగా జగనన్న కాలనీల లేఅవుట్లు ఉండటం.. అక్కడ వసతులు కల్పించకపోవడంతో ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు రావట్లేదు. కొన్ని చోట్ల పనులు చేపట్టేందుకు ముందుకొచ్చినా ఇసుక కొరత.. ముడి సామగ్రి ధరలు ఆకాశన్నంటడం.. ప్రభుత్వమిచ్చే సాయం తక్కువగా ఉండటం ఇబ్బంది పెడుతోంది. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ నిధులతో కలిపి ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు చొప్పున అందజేస్తోంది. కూలీతోపాటు సామగ్రి ధరలన్నీ పెరిగిన నేపథ్యంలో ఆ నగదుతో ఇంటి నిర్మాణం చేపట్టడానికి సరిపోవడం లేదు. ఆప్షన్ కింద ప్రభుత్వమే ఇంటిని నిర్మించి ఇవ్వాలని ఎక్కువ మంది లబ్ధిదారులు కోరుకుంటున్నారు. కొన్ని లేఅవుట్లలో ప్రైవేట్ వ్యక్తులతో ఇళ్ల నిర్మాణాలు చేయిస్తున్నా బిల్లులు వెంటనే విడుదలవ్వక పనులు నెమ్మదిగా సాగుతున్నాయి.

డిసెంబరు 21న తేదీకి జిల్లాకు నిర్దేశించిన అన్ని పక్కా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు గ్రామాల బాట పడుతున్నారు. లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహిస్తూ ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రావాలంటూ వారిని చైతన్యపరిచే ప్రయత్నం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని లబ్ధిదారులు ఒక్కొక్కరికి సెంటున్నర చొప్పున స్థల పట్టా అందజేశారు. ఆర్థిక సాయం గ్రామీణ, పట్టణ ప్రాంతాల లబ్ధిదారులకు ఒకేలా ఉంది.

ఉమ్మడి జిల్లాకు 96వేలు ఇళ్లు మంజూరు చేయడం జరిగింది. పాలకొండ, రాజాం నియోజకవర్గాల పరిధిలోకి 15వేలు ఇళ్లు ఉండగా మిగిలిన 81వేల ఇళ్లు నిర్మించేందుకు లక్ష్యంగా నిర్ణయించారు. వాటిలో 66వేల ఇళ్లు పూర్తిచేయాల్సి ఉంది. వీటిలో 6,631 ఇళ్లకు ఇప్పటివరకు రిజిస్ట్రేషన్లు కూడా జరగలేదు.

డిసెంబర్ 15వ తేదీ నాటికి 33వేల ఇళ్లకు విద్యుత్తు కనెక్షన్లు, మౌలిక వసతులు పూర్తికావాలన్నది ప్రభుత్వ లక్ష్యం. జిల్లాలో 28వేల గృహాలు పూర్తి చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 12,859 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. సుమారు 16 వేల ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి, సెప్టెంబర్‌లో 8,032 గృహాలను నిర్దేశించగా 3,100 ఇళ్లు మాత్రమే పూర్తిచేయగలిగారు. అక్టోబరులో 6వేల ఇళ్లు లక్ష్యం కాగా కేవలం 1,976 ఇళ్లు పూర్తయ్యాయి. నవంబరులో అదే తరహాలో ఇళ్ల నిర్మాణం జరుగుతోంది.

ప్రభుత్వమిచ్చే సాయానికితోడు ఇంటి నిర్మాణాలకు బ్యాంకుల నుంచి రుణాలు అందిస్తామని మెప్మా, వైఎస్‌ఆర్ క్రాంతిపథం క్షేత్రస్థాయి అధికారులు డ్వాక్రా మహిళలను ప్రోత్సహిస్తున్నారు. మౌలిక వసతుల్లేని చోట ఇంటి నిర్మాణాలు చేపట్టి ఎలా ఉండాలనే ప్రశ్న ఎక్కువ మంది నుంచి వస్తోంది. మౌళిక వసతులపై ఇంజినీరింగ్ శాఖలు పెద్దగా శ్రద్ధ చూపడంలేదు. పనులు చేస్తున్న వాటికి సకాలంలో బిల్లులు విడుదల కావడం లేదు. మంజూరు ఇచ్చినంత వేగంగా చెల్లింపులు జరగడం లేదు. దీంతో పనులు చేసేందుకు పెద్దగా ఆసక్తి కనపడడం లేదు.

అత్యధికంగా శ్రీకాకుళం అర్బన్‌లో 1,452, టెక్కలిలో 649, ఎచ్చెర్లలో 476, శ్రీకాకుళం రూరల్‌లో 444, నరసన్నపేటలో 251 పెండింగ్ ఉన్నాయి. పిఎంఎవై గ్రామీణ్ పథకం కింద జిల్లాలో 3,071 ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు. వీటిలో 341 గృహాలు రిజిస్ట్రేషన్లు కాలేదు. 471 గృహాలకు జియో ట్యాగింగ్ కాలేదు. జియో ట్యాగింగ్ అయి మంజూరుకాని గృహాలు 104 ఉన్నాయి. గృహ నిర్మాణాల్లో, జియో ట్యాగింగ్, రిజిస్ట్రేషన్ కీలకంగా మారాయి. జిల్లాలోని 30 మండలాలు, మూడు మున్సిపాలిటీలు, ఒక నగరపాలక సంస్థ ఉన్నాయి. తొలి విడతలో మంజూరు చేసిన ఇళ్లను త్వరిగతిన పూర్తి చేయాలన్న గృహ నిర్మాణ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఒత్తిడి పెంచుతున్నారు. అయినా అడ్డంకుల వల్ల ఇళ్ల నిర్మాణం అనుకున్నంత వేగంగా సాగడం లేదు.



మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు, కెఎస్.లక్ష్మణరావు, ఎంవిఎస్.శర్మ

నూతన ఆర్థిక, సరళీకరణ విధానాలతో

ప్రభుత్వరంగానికి ముప్పు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నూతన ఆర్థిక, సరళీకరణ విధానాలతో ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు తోడ్పాటు అందిస్తోందని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్(ఎన్ఎఫ్‌పిఇ) రాష్ట్ర కన్వీనరు బి.శ్రీధర్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని వరం రెసిడెన్సీలో ఎన్ఎఫ్‌పిఇ ఆధ్వర్యాన తపాలా ఉద్యోగుల విజ్ఞాన తరగతులు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు- ఐక్య పోరాటాలు- అనుభవాలు అనే అంశంపై ఆయన మాట్లాడారు. ఎనిమిదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనేక ప్రభుత్వరంగ సంస్థలను మూసేవేయడంతో నిరుద్యోగ సమస్య విపరీతంగా పెరిగిందన్నారు. మరో వైపు కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి ఉద్యోగుల, కార్మికుల హక్కులను హరిస్తోందని చెప్పారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పోస్టల్ శాఖలో కీలకమైన జిడిఎస్ ఉద్యోగుల సీనియారిటీ, ఇంక్రిమెంట్‌లను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. మెడికల్ సదుపాయాలను కల్పించకుండా ఉద్యోగులకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి డిసెంబర్ 8న ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల కాన్ఫెడరేషన్‌లు సంయుక్తంగా నేషనల్ కన్వెన్షన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు కోసం నిరవధిక సమ్మెకు వెళ్లేందుకు ఉద్యోగులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులంతా సమస్యలను అధిగమించడానికి సమిష్టిగా పోరాడాలని పిలుపు నిచ్చారు.

కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు రాజ్యాంగం- కార్మిక హక్కులపై దాడి- ఉద్యోగుల, సంఘాల కర్తవ్యం అనే అంశంపై ఉపన్యసించారు.

ఎన్ఎఫ్‌పిఇ రాష్ట్ర కన్వీనరు బి.శ్రీధర్‌బాబు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులపై, ప్రభుత్వ రంగంపై అనుసరిస్తున్న వైఖరి రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. కార్మిక చట్టాలను కార్పొరేటు సంస్థలకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా మారుస్తూ కొత్తగా చట్టాలు తీసుకొస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే కార్మిక చట్టాలను నాలుగు లేబరు కోడ్లుగా మార్చేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. సుదీర్ఘ కాలం పాటు ఉద్యమాల ద్వారా సాధించుకున్న 8గంటల పని దినాన్ని 12గంటలకు మార్చాలని చూస్తున్నారన్నారు. ఉద్యోగుల వేతనాల్లో కోతలు విధిస్తున్నారన్నారు. డిఎలు, ఇంక్రిమెంటు చెల్లించకుండా అన్యాయం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ వ్యతిరేక విధానాలపై సమైక్య పోరాటాల ద్వారా తిప్పి కొట్టల్సిన బాధ్యత మనందరి పైన ఉందని అన్నారు. ప్రభుత్వాల విధానాలు - ప్రభుత్వ రంగం- ఉద్యోగుల భవిష్యత్ అనే అంశంపై మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం రాయితీల పేరుతో కార్పొరేట్లకు రూ.వేల కోట్లు రుణాలు మాఫీ చేస్తూ మధ్య తరగతి, దిగువ తరగతి ఉద్యోగుల పైన అనవసరమైన భారాలు మోపుతూ ఉద్యోగుల జీవితాలను చిన్నాభిన్నం చేస్తోందన్నారు. ఈ విధానాలను ఉద్యోగులందరూ రైతు ఉద్యమ స్ఫూర్తితో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఆధునికీకరణ పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను కుదించడం, మూసివేయడం చేస్తోందని చెప్పారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమిస్తూ నిరుద్యోగుల ఆశలపై నీళ్లు జల్లుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల హక్కులను ఒక్కొక్కటిగా హరించివేస్తున్న ఈ తరుణంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్‌పిఇ అనుబంధ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు ఇ.శంకర్‌నాయుడు, పెంట పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకూ సాగునీరు

లైదాం ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవంలో సీతారాం

ప్రజాశక్తి - పొందూరు

ఆమదాలవలస నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకూ సాగునీరు అందిస్తామని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆదివారం మండలంలోని లైదాం గ్రామంలో నాబార్డు సహాయంతో రూ.8.56 కోట్లతో నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ ఈ ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలోని లైదాం, కొంచాడ, రాపాక, కొల్లిపేట, పొందూరు, జి.సిగడాం మండలం వాండ్రంగి గ్రామాల పరిధిలో సుమారు 1174 ఎకరాల విస్తీర్ణంలో పుష్కలంగా సాగునీరు లభిస్తుందన్నారు. రెల్లిగడ్డ నీటి ఆధారంగా లభ్యమయ్యే సాగునీరు లిఫ్ట్ చేయడం ద్వారా ఆయా గ్రామాల పరిధిలో 1059 మంది రైతులు లబ్ధి పొందనున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నియోజకవర్గంలో 13 లిఫ్ట్ ఇరిగేషన్ పనులు మంజూరయ్యాయని అన్నారు. పొందూరు మండలానికి సంబంధించి లైదాం, తండ్యాం గ్రామాలకు ఎత్తిపోతల పథకాలు మంజూరైనట్లు వివరించారు. ప్రస్తుతం తండ్యాంలో 1933 ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఎత్తిపోతల పథకం పనులు సాగుతున్నాయని చెప్పారు. నాగావళి-వంశధార, వంశధార-బాహుదా నదుల అనుసంధానంతో సుమారు 75వేల ఎకరాలకు సాగునీరు లభించే అవకాశముందన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం ద్వారా రణస్థలం, లావేరు, జి.సిగడాం, ఎచ్చెర్ల, సంతకవిటి మండలాల్లో సాగు, తాగునీరు లభించనుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో తమ్మినేని చిరంజీవి నాగ్, ఎపిఎస్ఐడిసి రాష్ట్ర డైరక్టర్ మళ్ల రవికుమార్, నీటిపారుదల అభివృద్ధి సంస్థ పర్యవేక్షక ఇంజినీర్ ఎం.లక్ష్మీ నారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కెవివి సుబ్రహ్మణ్యం, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి కిల్లి ఉషారాణి, వైసిపి మండల అధ్యక్షులు పి.రమేష్. ఎఎంసి చైర్మన్ సునీల్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, వైస్ ఎంపిపిలు వండాన శ్రీదేవి, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిల్లాన సూర్యారావు, గుడ్ల మోహన్, నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపిటిసిలు, పాల్గొన్నారు.



ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

సీదిరికి మళ్లీ టిక్కెట్ ఇస్తే ఓడిస్తాం

- మంత్రి అక్రమాలపై దర్యాప్తు చేయాలి
- అభ్యర్థిని మారిస్తేనే వైసిపి విజయం
- లేకుంటే పార్టీ భూస్థాపితం
- ఉద్ఘాటించిన అసమ్మతి నేతలు

ప్రజాశక్తి - పలాస, మందస

రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజుకు రానున్న ఎన్నికల్లో వైసిపి పలాస శాసనసభ స్థానానికి మళ్లీ టిక్కెట్ ఇస్తే ఓడిస్తామని వైసిపి అసమ్మతి నేతలు ఉద్ఘాటించారు. పార్టీలోని సీనియర్లను పక్కనపెట్టి గ్రామాల్లో వైసిపి రెబల్ అభ్యర్థులను తయారు చేసి, పార్టీకి నష్టం కలిగిస్తున్నారని అన్నారు.. మందస మండలం దున్నూరు సముద్రతీరంలో ఆదివారం వైసిపి జిల్లా కార్యదర్శి దువ్వాడ హేంబాబు చౌదరి ఆధ్వర్యంలో మంత్రి అప్పలరాజుకు వ్యతిరేకంగా పలాస నియోజకవర్గం పరిధిలోని వైసిపి అసమ్మతి నేతలు మూడో సారి సమావేశం అయ్యారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చాలని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా హేమబాబు చౌదరి మాట్లాడుతూ సీనియరు నాయకులపై అప్పలరాజు అరాచకాలను చూడలేక అంతా ఏకమయ్యామన్నారు. పలాస నియోజకవర్గంలో జరుగుతున్న దారుణాలను సిఎం జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, పార్టీ అభ్యర్థిని మారాల్చని వాణిని వినిపిస్తామన్నారు. మార్చకుంటే పార్టీ ప్రతిష్టత, మనుగడ కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఇక్కడ అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలకు కారణం ఎవరనేది తెలుసుకుంటే పార్టీ మనుగడ సాగిస్తుందన్నారు. ఈ నియోజకర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చినప్పుడే పార్టీ గెలుస్తుందని, మార్చకుంటే కార్యకర్తలమంతా ఓ నిర్ణయాన్ని తీసుకుంటామన్నారు. రాష్ట్ర అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ జుత్తు నీలకంఠం మాట్లాడుతూ అప్పలరాజు గెలుపు కోసం అహర్నిశలు శ్రమిస్తే సీనియర్ నాయకులకు నియోజకవర్గంలో విలువ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి పాలనలో అక్రమాలు, అన్యాయాలు చేసి, పార్టీ పరువును అప్పలరాజు తీస్తున్నారని అన్నారు. వైసిపి పట్టణ అధ్యక్షులు దువ్వాడ శ్రీకాంత్, మార్పు షణ్ముఖరావు మాట్లాడుతూ మందస మండలంలో 41 పంచాయతీలో సీనియర్ నాయకులను విస్మరించారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో అప్పలరాజుకు టికెట్ కేటాయిస్తే ఓడించడం ఖాయమని స్పష్టం చేశారు. తప్పనిసరిగా వేరే వ్యక్తికి టికెట్ కేటాయించాలని అదిష్టానం దృష్టికి తీసుకెళ్తామని, ఇప్పటికే మంత్రి బొత్స సత్యనారాయణ, ధర్మాన కృష్ణదాస్ దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. అప్పలరాజు అక్రమాలపై పార్టీ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తిమ్మల విజయ్, తలగాన నరసింహమూర్తి, సాయినా ఉమాపతి, దత్త లక్ష్మీనారాయణ, కమలమ్మ, పుష్ప, అఖిల్, వాసు దువ్వాడ జయరాం చౌదరి, సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి అసమ్మతి నాయకులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న దువ్వాడ హేమబాబు చౌదరి


మహిళా సాధికారతకు ఊతం

- జీవన ప్రమాణాల పెంపు
- ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్
- డిఆర్‌డిఎ పీడీ జివి విద్యాసాగర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



మహిళలు స్వయంశక్తితో పైకి రావాలన్న లక్ష్యంతో ప్రభుత్వం లైవ్‌లీహుడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను ఏర్పాటు చేసిందని, దీని వల్ల మహిళలు పారిశ్రామికంగా ఎదగడానికి తోడ్పడుతుందని డిఆర్‌డిఎ పీడీ జివి.విద్యాసాగర్ పేర్కొన్నారు. చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా ఆర్థికంగా లబ్ధిపొందడానికి వీలుంటుందన్నారు. ఫుడ్ ప్రోసెసింగ్, హార్టిజన్స్ తయారీ, బ్యూటీ క్లినిక్‌లు వంటివి ఏర్పాటు చేయడం ద్వారా స్వయంశక్తితో అభివృద్ధి చెందడానికి వీలుంటుంది. మహిళలు ఉత్పత్తి చేస్తున్న అనేక రకాలైన ఉత్పత్తులను ఆన్‌లైన్ మార్కెటింగ్ సౌకర్యాన్ని కల్పించడంతో పాటు రాయితీపై రుణాలు ఇవ్వడం, వారికి సందేహాలు తీర్చి, అన్ని రకాలుగా తోడ్పాటు అందిన్నాం. మహిళల జీవన ప్రమాణాలు పెంచుకునేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సెర్ప్ సహకారంతో పూర్తి సహకారాన్ని అందిస్తున్నట్లు ప్రజాశక్తి ముఖాముఖిలో తెలిపారు.



మహిళా సాధికారతకు ఎలాంటి ప్రోత్సాహం లభిస్తోంది?

జిల్లాలో ఎక్కువ మంది మహిళలు నిరక్ష్య రాస్యులుగానే ఉన్నారు. వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంతో పాటు వ్యాపార, వాణిజ్య రంగాల్లో వారికి చోటు కల్పించేందుకు అనేక రకాలుగా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వారి జీవన ప్రమాణాల మెరుగుపరచడానికి 35శాతం రాయితీపై రుణాలు అందిస్తోంది. వీటితో హాస్పటల్స్ నిర్వహణ, బ్యూటీ క్లినిక్‌ల నిర్వహణ, ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్లు నెలకొల్పడానికి తోడ్పాటు అందిస్తునాం. జిల్లాలో ఇప్పటికే కొందరు మహిళలు గ్రూప్‌లుగా ఏర్పడి చిరు వ్యాపారాలు సాగిస్తున్నారు. వారు ఉత్పత్తి చేస్తున్న ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తున్నాం. మహిళలకు మార్కెటింగ్‌పై అంతగా అవగాహన లేకపోవడం వల్ల వారు నష్ట పోయే ప్రమాదం ఉంది. అందువల్ల ప్రభుత్వం, అమెజాన్, ఫ్లిప్‌కార్టు వంటి ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థలతో ఒప్పందాలను కుదుర్చుకున్నాం. ఆన్‌లైన్‌లో సరకుల డిమాండ్‌ను బట్టి ఉత్పత్తిని పెంచుకోవాల్సి ఉంటుంది. లేకుంటే ఆయా సంస్థలు ఆన్‌లైన్ సేవలు అందించేందుకు ముందుకు రారు. అందువల్ల నాణ్యత, నైపుణ్యంతో పాటు సామర్థ్యం కలిగి ఉండాలి. ఆ దిశగా ఆయా గ్రూప్‌లను చైతన్య పరచడం జరుగుతోంది.

ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు ఎలాంటి సహకారం అందుతోంది?

జిల్లాలో స్థానికంగా ఉత్పత్తి అవుతున్న అనేక ఉత్పత్తులకు రాష్ట్రంలోనే కాక జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ గిరికీ పెరుగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో విక్రయించాలంటే తప్పని సరిగా అంతర్జాతీయ ప్రమాణాలు ఉన్న ఉత్పత్తులనే అమ్మాల్సి ఉంటుంది. అందువల్ల గ్రూప్‌లకు ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నాం. ఇప్పటికే పొందూరు ఖాదీ ప్రపంచ మార్కెట్లో అమ్ముడవుతోంది. ఆన్‌లైన్ మార్కెటింగ్ సౌకర్యాన్ని అనుసంధానం చేయడం వల్ల పొందూరు కేంద్రంగా మహిళలు నేరుగా లబ్ధిదారులకు వాటిని అందివ్వగలుగుతున్నారు. దీనివల్ల సంఘాలకు ఆర్థిక ప్రయోజనం కలుగుతోంది. కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించేందుకు ఇవి ఎంతగానో తోడ్పడతాయి. పొందూరు ఖాదీ ఉత్పత్తులను ఇప్పటికే అనేక దేశాల్లో ఉన్న వారికి ఆన్‌లైన్ ద్వారా అమెజాన్, ఫ్లిప్‌కార్టు సంస్థలు మార్కెటింగ్ చేస్తున్నాయి.

మార్కెట్ ప్రాధాన్యతను బట్టి ఉత్పత్తుల తయారీ ఎలా సాగుతోంది?

జిల్లాలో మహిళలు తయారు చేస్తున్న అనేక ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్ల ద్వారా నరసన్నపేట, సోంపేటలో అప్పడాలు, సారవకోటలో చుప్పులు, మందస కోవా, బుడితి, మాకివలస గ్రామాల్లో ఇత్తడి వస్తువులు తయారీ, వంటి యూనిట్లు నడుస్తున్నాయి. వాటి పరిధిలో ఉత్పత్తి చేస్తున్న వాటిని స్థానికంగా మాత్రమే అమ్ముకోగలుగుతున్నారు. వాటికి ఆన్‌లైన్ మార్కెటింగ్ సౌకర్యం కల్పించడం ద్వారా ఇతర ప్రాంతాలకు విక్రయించేందుకు వీలుంటుంది. కాని ఫుడ్ ప్రోసెసింగ్ ఉత్పత్తులను సకాలంలో లబ్ధిదారులకు చేరవేయాల్సి ఉంటుంది. లేకుంటే అవి పాడవటం జరుగుతుంది. దీనివల్ల ఆయా సంస్థల నుంచి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉంది. అందువల్ల డిమాండ్‌ను బట్టి ఈ ఉత్పత్తులను తయారు చేయడం, సకాలంలో వాటిని లబ్ధిదారులకు చేర వేయడం కష్టతరమైంది. దీంతో స్థానికంగా ఉన్న మార్కెట్‌లోనే వాటిని విక్రయించడం జరుగుతుంది. ప్రత్యామ్నాయ మార్గాలను వెతికి వాటిని ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు అనుసంధానం చేయడం జరుగుతుంది.

అర్హులందరికీ పింఛన్లు ఇస్తున్నారా?

జిల్లాలో వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ వంటి తదితర అన్ని కేటగిరీలు కలిపి 3,14,443 పింఛన్లు ఉన్నాయి. సకాలంలో పెన్షన్ పొందలేని లబ్ధిదారులకు వచ్చే నెలలో పొందడానికి వీలుంటుంది. కానీ ఆ నెలలోనూ తీసుకోకపోతే పెన్షన్ రద్దయ్యే పరిస్థితి ఉంటుంది. అందువల్ల అర్హులైన లబ్ధిదారులు సకాలంలో పెన్షన్ పొందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. అర్హత ఉండి ఏదైనా కారణం వల్ల పెన్షన్ తొలగించినట్టయితే పూర్తి ఆధారాలు సమర్పించడం ద్వారా సచివాలయాల్లో దరకాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

స్త్రీనిధి పథకం అమలు, రుణాల చెల్లింపునకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఈ పథకం కింద ఏటా రూ.కోట్లాది రుణాలు ఇవ్వడం జరుగుతోంది. ఇచ్చిన రుణాలు తిరిగి చెల్లించడానికి వీలుగా స్త్రీనిధి బ్యాంకుల ద్వారా సేవలు అందిస్తున్నాం. వీటికి తోడు ఉప ప్రణాళికా నిధులతో ఉన్నతి పథకాన్ని కూడా జిల్లాలో అమలు చేయడం జరుగుతోంది. రుణాలు పొందిన మహిళలు ఆర్థికాభివృద్ధి కోసం సొంతంగా చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. అందువల్ల రికవరీ కూడా ప్రతినెలా చెల్లించడం సులువుగా ఉంది. జిల్లాలో మహిళల్లో సాదికారిత దిశగా తీసుకెళ్లడానికి డిఆర్‌డిఎ ఎంతగానో ప్రయత్నిస్తోంది. పథకాల అమలుతో పాటు వారి ఆర్థిక స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతోంది. దీనివల్ల మంచి ఫలితాలు సాధించగలుగుతున్నాం.

అమూల్య సంపద యోగా

మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ప్రాచీన భారత సంప్రదాయాన్ని ప్రపంచానికి అందించిన అమూల్య సంపద యోగా అని అన్నారు. ఆదివారం నగరంలో స్టార్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన సుమారు రూ.40లక్షలతో నిర్మించతలపెట్టిన యోగా భవన్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా అంటే వ్యాయామ సాధనల సమాహారాల ఆధ్యాత్మిక రూపమన్నారు. ధ్యాన యోగం మానసిక ఆరోగ్యానికి చక్కగా తోడ్పడుతుందన్నారు. హఠ యోగంలో భాగమైన శారీరకమైన ఆసనాలు శరీరారోగ్యానికి తోడ్పడి, ఔషధాల వాడకాన్ని తగ్గించి దేహదారుఢ్యాన్ని, ముఖ వర్చస్సుని పెంచుకునేందుకు తోడ్పడుతుందన్నారు. వాకర్స్ సంస్థలు సమాజ హితం కోరి ప్రజలకు మేలు చేస్తున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరికీ జీవితంలో యోగా ఎంతగానో తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి, ఎస్.పి.రవీంద్ర, ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఐ.గుణేశ్వరరావు, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ, వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ పి.జి.గుప్తా, స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు శాసపు జోగినాయుడు, జి.ఇందిరాప్రసాద్, కూన వెంకటరమణమూర్తి, పి.ఉమామహేశ్వరరావు, గుడ్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు..



శంకుస్థాపన చేస్తున్న మంత్రి ధర్మాన

రేపు జిల్లాకు ఎస్‌పిసిఆర్ సభ్యుల రాక

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఈ నెల 29న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఆమదాలవలసలో పర్యటించనున్నారు. ఈ మేరకు గుంటూరులోని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కార్యాలయం ఒక ప్రకటనను విడుదల చేసింది. మండలంలోని అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలతో, స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. మండలంలో కొన్ని ప్రైవేటు, కార్పొరేటు స్కూళ్లను పరిశీలించనున్నారు. కెజిబివి పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు చేయనున్నారు.



పోటీలో పాల్గొన్న బాడీ బిల్డర్లు

మిస్టర్ ఆంధ్రా పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలోని మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో ఆదివారం రాత్రి మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక రాయల్ స్కెడ్, హనుమాన్ జిమ్ ఆధ్వర్యాన మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్ పోటీలో రాష్ట్రవ్యాప్తంగా బాడీ బిల్డర్లు పాల్గొన్నారు. స్థానిక వైద్యులు డాక్టర్ వెచ్చా సంతోష్, వారు కౌన్సిలర్ బి.జగన్ లంఛనంగా పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలో గెలుపొందిన ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్స్ షిప్ విజేతకు రూ.30 వేలు నగదు, బహుమతి, షీల్డ్‌ను అందజేశామని నిర్వహకులు తెలిపారు. బెస్ట్ మజిల్‌కి రూ.పది వేలు, బెస్ట్ ఫాజర్‌కి రూ.5 వేలు బహుమతిని అందజేశామన్నారు. కార్యక్రమంలో నందిగాం కోటేశ్వరరావు, శ్రీకాంత్‌రెడ్డి, ఎం.రాంబాబు పాల్గొన్నారు. ఈ పోటీలకు వివిధ జిల్లాల నుంచి 15 మంది న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.



మాట్లాడుతున్న సిమ్మినాయుడు

కరువు భత్యమైనా చెల్లించాలి

ఆమదాలవలస : పెన్షనర్లకు చెల్లించాల్సిన కరువు భత్యమైనా కనీసం చెల్లించరా అంటూ ఆల్ పెన్షనర్స్ అండ్ విశ్రాంత పర్సన్స్ అసోసియేషన్ ప్రభుత్వానికి ప్రశ్నించింది. స్థానిక మున్సిపల్ పాఠశాల లక్ష్మీనగర్ ఆవరణలో సురవరపు సిమ్మినాయుడు అధ్యక్షతన ఆదివారం సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్ధనరావు తీర్మానం ప్రవేశ పెట్టారు. ప్రభుత్వం వెంటనే 2018 జూలై నుంచి బకాయి పడిన కరువు భత్యం తక్షణమే చెల్లించాలని కోరారు. గౌరవ అధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు మాట్లాడుతూ పెన్షనర్లు కూడా వయోభారాన్ని విస్మరించి తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి సంఘటిత ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. డిసెంబరు 17న పెన్షనర్ డేను విజయవంతం చేయాలని కార్యవర్గ సమావేశం కోరింది. డి.లక్ష్మణరావు, ఎన్.చంద్రశేఖరరావు, డి.శ్రీరామ్మూర్తి, కె.కోటేశ్వరరావు, బి.చిట్టెయ్య, పి.భానోజీరావు, ఎన్.వాసుదేవరావు, కె.షణ్ముఖరావు, ఆర్.సత్యనారాయణ, ఎన్.సూర్యనారాయణ, పి.అప్పారావు, బి.గోవిందరావు, ఎం.రాజేశ్వరరావు, బి.నారాయణరావు, కె.సంజీవరావు పాల్గొన్నారు.

వరద నీటిని ఒడిసి పడితే... శివారు భూములు సస్యశ్యామలమే

ఏటా వృథాగా పోతున్న సాగునీరు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వంశధార శివారు భూములకు మూడేళ్ల నుంచి సాగునీరు అందకపోవడంతో ఏటా కరువు బారిన పడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను శివారు ఆయకట్టు రైతులు పాలకుల, అధికారుల ఎదుట మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం. ఒకరిపై నెపం మోపి తప్పించుకొనే ప్రయత్నం తప్ప శివారు రైతులకు కనుచూపు మేరలో పరిష్కారం కనిపించడం లేదు. వంశధారకు ఎగువ ప్రాంతంలో అనధికార ఎత్తిపోతల కారణంగానే రైతులకు సాగునీరు అందించలేకపోతున్నామని నిత్యం రైతులకు ఎదురవుతున్న సమాధానాలు విస్తుగొలుపుతున్నాయి. ప్రభుత్వం అన్నిచోట్లా ఎత్తిపోతల పథకాలకు ప్రాధాన్యం ఇస్తూ బంజరులను సైతం సాగులోకి తీసుకొస్తుంది. బెండిగెడ్డ నుంచి పొలాలను ఆణించి పారుతూ సముద్రంలో వృథాగా కలిసిపోతుంది. వరద నీటిని ఒడిసి పడితే సుమారు 750 ఎకరాలు సస్యశ్యామలం అవుతుందని రైతులు చెబుతున్నారు.

బెండిగెడ్డ చెక్ డ్యామ్‌కు కుడి కాలువ అవసరం

ఎక్కడైనా ఒక ప్రాజెక్టు నిర్మిస్తే అక్కడ కుడి, ఎడమ కాలువలు ఏర్పాటు చేసి పంట పొలాలకు సాగునీరు అందిస్తారు. బెండిగెడ్డ చెక్ డ్యామ్‌కు ఎడమ కాలువ ద్వారా బెడ్డ చెరువు, దేశబంద, కొత్తచెరువుల ద్వారా బెండి, నగరంపల్లి, మహాదేవిపురం, శివరాంపురం తదితర గ్రామాల పరిధిలో 1200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. అప్పటి సాంకేతికత లోపం కారణంగా కుడి కాలువ ఏర్పాటు చేయలేదు. ప్రస్తుత సాంకేతికతను వినియోగించి కుడి కాలువను బెండికొండకు ఆణించి కాలువ తవ్వి సీతాపురం ఎర్ర చెరువు, పెద్దబొడ్డపాడు రామసాగరం, కొండవూరు చాకి చెరువులకు వరద నీటిని మళ్లిస్తే 750 ఎకరాల వరకు సస్యశ్యామలం అవుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఈ వరద కాలువ ఏర్పాటు చేసి నీరు మళ్లిస్తే బట్టుపాడు, పలాస మండలంలోని సరియాపల్లి ముంపు సమస్యల నుండి రక్షణ కలుగుతుందని పేర్కొంటున్నారు. వంశధార నీరు అందక ఏటా కరువులతో అల్లాడుతున్న రైతులకు బెండిగెడ్డ చెక్‌డ్యామ్ వద్ద కుడి కాలువ నిర్మించాలని రైతాంగం కోరుతుంది.



బెండిగెడ్డలో ఉన్న చెక్‌డ్యాం

చెక్ డ్యాం నిర్మించాలి



బెండిగెడ్డ చెక్‌డ్యాం వద్ద కుడి కాలువ నిర్మించాలి. దీనివల్ల సీతాపురం ఎర్ర చెరువు, పెద్దబొడ్డపాడు రామసాగరం, కొండవూరు చాకి చెరువులకు నీరు మళ్లుతుంది. ఏటా కరువులతో అల్లాడుతున్న రైతులకు ఉపశమనం కలుగుతుంది. 750 ఎకరాలు సాగునీరు అందుతుంది. ఆ దిశగా అడుగులు వేయాలి.

- ఉప్పాడ ఆనందరావు, మాజీ సర్పంచ్, పెద్దబొడ్డపాడు

బీడుగా మారుతున్నాయి



శివారు భూములు ఏటా బీడుగా మారుతున్నాయి. వంశధార శివారు రైతులు కాలువ చూసుకోవడమే కానీ అందులో నీరు ఉండదు. ఏటా విత్తనాలు జల్లడం, నీరు రాకపోవడం, మరో వైపు సకాలంలో వర్షాలు కురవకపోవడంతో అవి పోతున్నాయి. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నాం. పాలకులు, అధికారులు స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించాలి. **-తమ్మినేని గోపాలరావు, రైతు, సీతాపురం**

ఒకేరోజు రెండు పోటీలా?

- అయోమయంలో ఉపాధ్యాయులు
- ఆందోళనలో విద్యార్థులు

ప్రజాశక్తి- టెక్కలి

జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యాన ఈ నెల 29న నిర్వహించనున్న జిల్లాస్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన టెక్కలిలో నిర్వహించనున్నారు. కాగా, ఆదే రోజు మండల స్థాయి గ్రిగ్స్ పోటీలూ నిర్వహిస్తుండడంతో ఒకే రోజు రెండు పోటీలు అయ్యాయి. దీంతో ఉపాధ్యాయులు అయోమయంలో ఉన్నారు. విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. రెండూ ప్రధానమైన పోటీలు ఒకేరోజు ఉండడంతో విజయవంతం చేయడంలో ఇబ్బందులు తలెత్తే పరిస్థితులు ఉన్నాయని నిర్వాహకులు, ఉపాధ్యాయులు భావిస్తున్నారు. వాస్తవంగా జిల్లా స్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన ఈ నెల 25న టెక్కలిలో నిర్వహించాల్సి ఉంది. కానీ, కొన్ని అనివార్య పరిస్థితులు కారణంగా 29కి వాయిదా వేశారు.

అయితే జిల్లా పరిధిలో మండలాల స్థాయి గ్రిగ్స్ పోటీలు 28 నుంచి 30 వరకు మండలాల్లో నిర్వహించనున్నారు. 29న మండలంలోని చాకిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో కబ్డాడీ, వాలీబాల్, పోటీలు నిర్వహించనున్నారు. 30న నర్సింగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఖోఖో పోటీలు నిర్వహించనున్నారు. రెండు పోటీలూ జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో నిర్వహించనున్నారు.

కృష్ణకు నివాళి

ఇచ్ఛాపురం : సినీనటుడు ఘట్టమనేని కృష్ణ ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు స్థానిక బస్టాండ్ వద్ద అభిమానులు సంతాప శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ముందుగా కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అభిమానులు కల్లేపల్లి శ్రీను, పింటు గౌడ్, శంకర, నారయ గోడ్, హడ్డు గౌడ్, వెంకటరావు పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

రమేష్ సేవలు చిరస్మరణీయం

మంత్రి అప్పలరాజు



మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

పలాస ప్రభుత్వాస్పత్రిలో సూపరింటెంట్‌గా పనిచేస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మడే రమేష్ చేసిన సేవలు చిరస్మరణీయమని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి వద్ద ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బింగ్ భవానీశంకర్ అధ్యక్షతన మడే రమేష్ సంతాప సభ ఆదివారం నిర్వహించారు. అంతకుముందు కాశీబుగ్గ వైఎస్ఆర్ విగ్రహం నుంచి పలాస ప్రభుత్వాస్పత్రి వరకు మంత్రితోపాటు పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో ఉన్న మడే అభిమానులు పెద్ద సంఖ్యలో ర్యాలీ చేపట్టారు. త్వరలో ఆయన గుర్తుగా శిలాఫలకంలో ఆయన పేరు, ఫొటో పెడతామని చెప్పారు. అనంతరం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, పలాస ప్రభుత్వ సూపరింటెండెంట్ డాక్టర్ చిన్నంనాయుడు, పలాస-కాశీబుగ్గ వైద్యులు ఎం.మల్లేశ్వరరావు, ప్రకాష్‌వర్మ, వైస్ సంఘం జిల్లా అధ్యక్షులు అంధవరపు సూరిబాబు, దానయ్య, ఎపి ఎన్‌జిఒ మండల అధ్యక్షులు బి.గోపాల్, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడున్నరేళ్లలో చుక్కనీరైనా ఇచ్చారా?

పలాస: వైసిపి ప్రభుత్వం వచ్చి, ఎమ్మెల్యే, మంత్రిగా డాక్టర్ సీదిరి అప్పలరాజు పదవులు చేపట్టారే తప్ప పలాస, వజ్రపుకొత్తూరు మండలాల శివారు భూములకు చుక్క నీరైనా సరఫరా చేశారా? అని బ్రాహ్మణతర్ల మాజీ ఎంపిటిసి గరుగు సింహాచలం, టిడిపి నాయకులు వడ్డీ యాదగిరి, రఘుపాత్రుని సుదర్శనరావు ప్రశ్నించారు. మండలంలోని బ్రాహ్మణతర్లలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడుపై మంత్రి అప్పలరాజు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టిడిపి ప్రభుత్వంలో మాజీ మంత్రి గౌతు శ్యాంసుందర్ శివాజీ వంశధార అధికారులతో మాట్లాడి శివారు భూములకు వంశధార అందించారని చెప్పారు. అప్పుడు అందిన వంశధార ఇప్పుడు ఎందుకు అందించలేక పోతున్నారని మంత్రిని ప్రశ్నించారు. టిడిపి నాయకులు గ్రామాలకు వస్తే వాళ్లని చొక్కా పట్టుకొని తరిమి తరిమి కొట్టండని అనుచిత వ్యాఖ్యలు చేయడం మంత్రి స్థానంలో ఉండి అలా అనడం సరికాదన్నారు. సమావేశంలో బ్రాహ్మణతర్ల టిడిపి ఆళ్ల సోమేష్, ఆళ్ల వెంకటరావు, గరికి కృష్ణారావు, కొవ్వూరు ధర్మారావు, పి.సింహాచలం, మనిగాం శ్రీనివాసరావు, బత్తల సూర్యం ఉన్నారు.

కనకాచలం పోరాటాలు స్ఫూర్తిదాయకం

టెక్కలి రూరల్ : ప్రజా ఉద్యమాల ద్వారా ప్రజా సమస్యలపై పోరాటం చేసి ఉద్యమాల వైపు ప్రజల దృష్టిని ఆకర్షింపజేసిన నాయకులు హనుమమతు కనకాచలం ఆలోచనా విధానం స్ఫూర్తిదాయకమని పలువురు పేర్కొన్నారు. మండలంలోని తలగాంలో పెద్ద కుమారుడు పద్మాకర్ అధ్యక్షతన కనకాచలం వర్ధంతి సభ ఆదివారం నిర్వహించారు. ముందుగా కనకాచలం దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పేడాడ రమేష్, మాజీ సర్పంచ్ హనుమంతు వెంకటేశ్వరరావు, ప్రజా సంఘాల నాయకులు హనుమంతు ఈశ్వరరావు, హనుమమతు ఉదయ్‌భాస్కర్, ముడిదాన భాస్కర్, చింతాడ రవికుమార్, గోపి, తారకేశ్వరరావు, లక్ష్మణరావు, దిలీప్ పాల్గొన్నారు.

సందడిగా భావనపాడు తీరం

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలంలోని భావనపాడు తీరంలో ఆదివారం పిక్నిక్ సందడి నెలకొంది. ఎస్పి జి.ఆర్.రాధిక కుటుంబ సభ్యులతో కలిసి భావనపాడు తీరాన్ని సందర్శించారు. సుమారు గంటసేపు తీరాన, ఫిషింగ్ హార్బర్‌లో పర్యటించారు. అధిక సంఖ్యలో యాత్రికులు, యువత, మహిళలుతో సాగర తీరం కిటకిటలాడింది. పెద్ద ఎత్తున వచ్చిన యాత్రికులు జీడి, సరుగుడు తోటల్లో ఉల్లాసంగా గడిపారు. చిన్న పెద్ద తేడా లేకుండా మధ్యాహ్నం నుంచి సముద్రంలో స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మెరైన్ పోలీసులు, నౌపడ పోలీసులు రక్షణ చర్యలు చేపట్టారు. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. సాయంత్రం యాత్రికులు తిరిగి వెళ్లే సమయంలో సుమారు గంట సేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు ఇక్కట్లు పడ్డారు.



తీరంలో సందడి చేస్తున్న సందర్శకులు



రక్షణ చర్యలకు సిద్ధంగా ఉన్న మెరైన్ పోలీసులు

సమిష్టి కృషితో హక్కులు సాధించుకుందాం

ఎన్‌జిఒ రాష్ట్ర సహాధ్యక్షులు పురుషోత్తంనాయుడు



శ్రీకాకుళం అర్బన్ : ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగుల హక్కులను సాధించుకునేందుకు సమిష్టిగా ముందుకు కదలాలని, అప్పుడే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు పిలుపునిచ్చారు. నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో ఎపిఎన్‌జిఒ నగర కమిటీ అసోసియేషన్ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా నిర్వహించారు. నూతన అధ్యక్షులుగా బి.శ్రీనివాసరావు, అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఎస్.ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా పి.రవీంద్రకుమార్, జె.వేణుగోపాల్, కె.లక్ష్మణరావు, ఐ.చిట్టిబాబు, కార్యదర్శిగా బి.నవీన్ కుమార్, జాయింట్ సెక్రటరీలుగా బి.మధుసూదనరావు, ఎ.రవికుమార్, షబీనా బేగం, పి.జనార్ధనరావు, జి.లలిత, కోశాధికారిగా కె.వి.నారాయణరావు, జిల్లా కార్యనిర్వహక సభ్యులుగా ఎ.సూర్యప్రకాశరావు, కెఎంఎం నారాయణరావులు, ఏడుగురు కార్యనిర్వహక సభ్యులు ఎన్నికయ్యారు. ఎన్నిల అధికారిగా ఆర్.గోవిందపట్నాయక్, సహాయక ఎన్నికల అధికారిగా కె.మోహనరావులు పర్యవేక్షించారు. సింగిల్ నామినేషన్లు దాఖలు కావడంతో ఏకగ్రీవ ఎన్నిక జరిగినట్లు ఎన్నికల అధికారి క్రటించారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తంనాయుడు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావు, రాయి వేణుగోపాలరావు, బడగల పూర్ణచంద్రరావులు అభినందించారు. అన్ని తాలూకా యూనిట్ల ఎన్నికలు ఏకగ్రీవం కావడంపై పురుషోంనాయుడు హర్షం వ్యక్తం చేశారు. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుని ఉద్యోగుల ఐక్యతను చాటి చెప్పారని కొనియాడారు. ఉద్యోగుల సంక్షేమే ధ్యేయంగా ఎపి ఎన్‌జిఒ సంఘం పనిచేస్తుందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో సమస్యలను పరిష్కరించుకోవడంలో కొత్తగా పుట్టుకువచ్చిన సంఘాల వల్ల ఇబ్బందులు వస్తున్నాయన్నారు. నూతనంగా ఎన్నికైన వారిలో యువతకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. భవిష్యత్‌లో ఐక్యపోరాటలతో ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించుకోగలమన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కె.జయరాం, పి.శ్రావణి పాల్గొన్నారు.

ఎన్‌జిఒ సంఘం నూతన కార్యవర్గం

పొందూరు : పొందూరు తాలూకా ఎన్‌జిఒ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. ఆదివారం తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారి సోమేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఎన్నికల పర్యవేక్షకులుగా జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం, కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు వ్యవహరించారు. పొందూరు తాలూకా ఎన్‌జిఒ సంఘం అధ్యక్షుడుగా బలివాడ ఈశ్వరరావు, సహాయ అధ్యక్షుడుగా ఎన్.శేఖర్‌బాబు, ఉపాధ్యక్షులుగా కె.అనీల్, పి.సునీల్‌రాజ్‌కుమార్, ఎం.రామకృష్ణ, కార్యదర్శిగా పి.మణిప్రసాద్, జాయింట్ సెక్రటరీలుగా జె.పవన్‌కుమార్, వి.జనార్ధనరావు, పి.జగన్నాథం, పొన్నాడ యశోద, కోశాధికారి పి.శ్రీనివాసరావు, సభ్యులుగా జి.వి.రత్నం, సిహెచ్.మురళీమనోహర్, ఎస్.ఎస్.బెనర్జీ, ఎన్.శంకరరావు, బి.లోకేష్, బి.వెంకటరమణ, సిహెచ్.ప్రేమకుమార్ ఎన్నికయ్యారు.



పొందూరు : ఎన్నికైన ఎన్‌జిఒ అసోసియేషన్ సభ్యులు

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



మాట్లాడుతున్న కృష్ణయ్య

ప్రజాశక్తి- టెక్కలి

పేదరికం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమని, 8 లక్షలు ఉన్న అగ్రవర్ణాలు పేదలైతే.. రెండు లక్షల ఉన్న ఇతరులు ధనికులు ఎలా అవుతారని, అంపశయ్యపై ఉన్న రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని కులవివక్షత పోరాట సమితి జిల్లా నాయకులు మిస్క కృష్ణయ్య అన్నారు. స్థానిక బిఎస్‌జెఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని దెబ్బతీసే ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్ల అమలును వ్యతిరేకిద్దాం అనే అంశంపై ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కులవివక్షత పోరాట సమితి అగ్రకుల పేదలకు వ్యతిరేకం కాదని, సమాజంలో కులవివక్ష అణచివేతకు, అవమానాలకు పీడన అనుభవిస్తున్న వర్గాలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించడంతో ఆర్థికంగా అభివృద్ధి చెంది సమాజంలో గౌరవంగా బతుకుతారనే ఉద్దేశంతో రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. సమావేశంలో జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు, డిటిఎఫ్ నాయకులు కొత ధర్మారావు, మేధావుల పోరం అధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి మాస్టార్, జాతీయ గిరిజన సమైక్య రాష్ట్ర నాయకులు గేదెల రమణమూర్తి, సిఐటియు నాయకులు హనుమంతు ఈశ్వరరావు, కార్మిక సంఘం నాయకులు కోళ్ల పాపారావు, మట్ట పురుషోత్తం, పోలాకి షణ్ముఖరావు, పూర మురళి, రాకొటి రాంబాబు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో 'చదవడం మా ఇష్టం'

లావేరు : మండలంలోని మురపాక, లావేరు శాఖాగ్రంథాలయాలలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో బాగా చదివిన విద్యార్థులకు గ్రంథాలయం తరుపున గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఆదివారమూ చదవడం మాకిష్టం కార్యక్రమం గ్రంథాలయాల్లో నిర్వహిస్తామని ప్రతి విద్యార్థీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు పి.షణ్ముఖరావు, ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



పుస్తకం చదువుతున్న విద్యార్థిని

52 జిఒను రద్దు చేయాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

బోయ, వాల్మీకి, బెంతు వరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చవద్దని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి సవర ధర్మానరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని చాపర సిఐటియు కార్యాలయంలో గిరిజన సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బెంతు వరియాలను, బోయలను ఎస్‌టి జాబితాలో చేర్పించేందుకు ప్రభుత్వం నియమించిన ఏకసభ్యా కమిషన్‌ను నియమిస్తూ జారీ చేసిన జిఒ నంబరు 52ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందిన గిరిజనేతరలకు ఎస్‌టి రిజర్వేషన్ కల్పించడంతో నిజమైన ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బెంతుఒరియాలను, బోయ, వాల్మీకులకు ఎస్‌టి జాబితాలో చేర్చవద్దని కోరుతూ కరపత్రాన్ని విడుదల చేశారు. గిరిజన సమస్యల పరిష్కార సాధనకు ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు జన్ని రామకృష్ణ, రామారావు, బి.రవి, దేవదాసు, జోగేంద్ర, గురునాథ్, ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘ ప్రతినిధులు



అధికార లాంఛనాల మధ్య జవాన్ అంత్యక్రియలు


వాకలవలసలో ఆర్మీ జవాను అంత్యక్రియలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అస్సాంలోని టేక్‌పూర్ క్యాంపు ఆర్మీ సుబేదార్‌గా బొడ్డేపల్లి సీతారాం (45) పనిచేస్తూ విధి నిర్వహణలో శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈ మేరకు అంత్యక్రియలు ఆయన స్వగ్రామం శ్రీకాకుళం మండలం వాకలవలసలో ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఆర్మీ అధికారులు అస్సాం నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ ఎయిర్ పోర్టుకు తీసుకొచ్చి... అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో ఆదివారం వేకువజామున వాకలవలస తీసుకొచ్చారు. పార్థీవదేహాన్ని చూసిన భార్య హేమలత, పిల్లలు, తల్లి, అక్కచెల్లెళ్లు గుండెలవిసేలా రోదించారు. అంత్యక్రియల్లో ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులు, ఆర్మీ జవాన్లు పాల్గొని ఘనంగా నివాళ్లర్పించారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

ప్రజాశక్తి- పొందూరు



వాసుదేవరావు మృతదేహం

ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న యువకు డు కుటుంబ కలహాల నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వెలుగు చూసింది. మండలంలోని తుంగపేటకు చెందిన బొడ్డేపల్లి వాసుదేవరావు (36) యువకుడు తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో రేకుల షెడ్డుకు ఉన్న దూలానికి చీరకట్టుకుని ఉరివేసుకున్నాడు. ఈ సంఘటనను స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. భార్య రమాదేవి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తనను భర్త వాసుదేవరావు సక్రమంగా చూసుకోవడంలేదని భార్య రమాదేవి ఇటీవల శ్రీకాకుళం మహిళా పోలీసులకు ఫిర్యాదు చేసిందని తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆశావర్కర్లు

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

డిసెంబరు 3,4 తేదీల్లో శ్రీకాకుళంలో సిఐటియు జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నామని, ఆశా వర్కర్లు పాల్గొని విజయవంతం చేయాలని ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి అధ్యక్షులు కె.నాగ మణి పిలుపునిచ్చారు. పట్టణంలో స్వేచ్ఛావతి అమ్మ వారు ఆలయంలో ఆదివారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అనంతరం మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు సంఘం ప్రతినిధి లక్ష్మీనారాయణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అరసవల్లికి రూ.8.08 లక్షల ఆదాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయానికి మార్గశిర మాసం ఆదివారం కావడంతో యాత్రికులు పోటెత్తారు. రద్దీ పెరగడం వల్ల ఆదివారం ఒక్క రోజు రూ.8.08 లక్షల మేరకు ఆదాయం సమకూరినట్టు ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. ప్రవేశంతో పాటు కేశ ఖండన, సూర్య నమస్కారాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.4,41,300, విరాళాల రూపంలో రూ.67,359 లు, ప్రసాదాల విక్రయాలు ద్వారా రూ.3,00,000లు ఆదాయం సమకూరినట్టు తెలిపారు.

ఘనంగా ఎన్‌సిసి దినోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సిసి విద్యార్థులు ఘనంగా 74వ ఎన్‌సిసి దినోత్సవ వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ యాల్ల పోలినాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖలు పాల్గొని పతాకాలను ఆవిష్కరించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో గాయత్రి డిగ్రీ కళాశాల ఎన్‌సిసి అధికారి కెప్టెన్ వి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీటితో అవస్థలు

ప్రజాశక్తి- పొందూరు



మురుగు నీటిని కాలువలోకి తోస్తున్న స్థానికులు

పొందూరు మండలం రాపాకలోని జామాన వీధిలో మురుగు నీరు రహదారిపై నిలిచిపోతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ వీధివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి కంటే కాలువ ఎత్తుగా ఉండటంతో మురుగునీరు బయటకుపోయేందుకు అవకాశం లేక నిలిచిపోతుంది. దీంతో దుర్వాసనతో పాటు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొన్నదంటూ వారంతా వాపోతున్నారు. ఎన్నో ఏళ్లుగా దీనిపై ఎన్నిసార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టుకున్న సమస్య పరిష్కారం కావడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని వీధివాసులు కోరుతున్నారు.


మాట్లాడుతున్న భానుమూర్తి

ఉద్యోగోన్నతి కల్పించాలి

ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు తక్షణమే కల్పించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. నగరంలోని ఎపిటిఎఫ్ కార్యాలయంలో జిల్లాశాఖ సబ్ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ, ఉద్యోగులకు రావాల్సిన కరువు భత్యం బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా శాఖ అధ్యక్షులు మజ్జి మదన్మోహన్ అధ్యక్ష ఉపన్యాసం చేయగా, ప్రధాన కార్యదర్శి బల్ల సుభాష్‌బాబు నివేదిక సమర్పించారు. రాష్ట్ర కార్యదర్శి సరస్వతి మాట్లాడుతూ పిఎఫ్, ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవ్ బకాయిలు విడుదల చేయాలన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు మాట్లాడుతూ ఉద్యోగుల, ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతుల కోసం పోరాటాలే శరణ్యమని పేర్కొన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షులు పి.అప్పలనాయుడు, బి.ఢిల్లేశ్వరరావు, జి.భీమారావు, ప్రత్యేక ఆహ్వానితులు బి.నేతాజీరావు, కార్యదర్శులు చావలి శ్రీనివాస్, డి.వీరయ్య, ఎస్.చాణుక్య, ఎం.గంగేశ్వరి, రాష్ట్ర కౌన్సిలర్లు జి.రమేష్, ఎన్.శ్రీనివాస్, బి.చంద్రశేఖర్, కె.విజయ్‌కుమార్, జి.రాజేష్, పి.లక్ష్మణరావు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న మాధవ్

డయల్ యువర్ డిఎంకు స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రోజూ ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికుల సమస్యలను పరిష్కరించడానికి డయల్ యువర్ డిఎం పేరిట ఆదివారం ఫిర్యాదులను స్వీకరించారు. బస్టాండ్ ఆవరణలో రెండు డిపోల మేనేజర్లు నేరుగా ఫిర్యాదు దారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. సకాలంలో బస్‌లు నడపడంతో ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని, వేళల్లో మార్పులు చేయాలని పలువురు ఫిర్యాదు చేశారు. సమయ పాలన లేక ప్రయాణికుల అవసరానికి బస్‌లు ఉండడం లేదని తెలిపారు. గతంలో రోడ్లు గోతులు పడ్డాయనే ఉద్దేశంతో రూట్లు రద్దు చేశారని, ఆ రూట్లలో తిరిగి బస్‌లు నడపాలని ఎర్రముక్కాంకు చెందిన వాసుదేవరావు, అంగూరుకు చెందిన కె.గోవిందరావులు కోరారు. పలాస, సోంపేట ప్రాంతాల నుంచి విశాఖకు సకాలంలో బస్సులు తిరగకపోవడంతో ప్రయివేటు ఆపరేటర్లను ఆశ్రయించాల్సి వస్తోందని రమణమూర్తి, జె.శ్రీనివాస్ తదితరులు ఫిర్యాదు చేశారు. డిపో మేనేజర్లు కె.మాధవ్, విశామ్యూల్, కె.ఆర్.ఎస్.శర్మ, గంగరాజు, ఎల్.ఎస్.నాయుడు పాల్గొన్నారు.


నగదు అందిస్తున్న హెల్పింగ్‌హేండ్స్ సభ్యులు

క్షతగాత్రునికి 'హెల్పింగ్ హేండ్స్' చేయూత

ప్రజాశక్తి- కవిటి

ఇటీవల సంభవించిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కవిటి మండలం సన్యాసిపుట్టుగకు చెందిన నర్తు భీమారావుకి బొరివంకకు చెందిన స్వచ్ఛంద సంస్థ హెల్పింగ్ హేండ్స్ అండగా నిలిచింది. నిరుపేద కుటుంబానికి చెందిన భీమారావు విషయం తెలుసుకున్న హెల్పింగ్‌హేండ్స్ సభ్యులు ఆదివారం గ్రామానికి చేరుకుని రూ.5 వేలు నగదు, రెండు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు బల్లెడ లక్ష్మణమూర్తి మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన భీమారావుని ఉదారంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్పింగ్ హేండ్స్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు స్పీకర్ పర్యటన ఇలా...

శ్రీకాకుళం : శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం ఉదయం 8.30 గంటలకు శ్రీకాకుళం బలగ వద్ద ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వద్ద నిర్వహించనున్న తెప్పోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. 10.30 గంటలకు జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా జ్యోతిరావు పూలే పార్కులోని జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలు వేసి నివాళ్లర్పిస్తారు. 11 గంటలకు కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన ఇన్‌పుట్ సబ్సిడీ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.

అక్రమమా? సక్రమమా?

- కొండ స్థలంలో పునాదులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం


సూదికొండ ప్రాంతంలో పిల్లర్లు వేసిన ఆక్రమణదారులు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గలో భూ కబ్జాలకు అంతేకాకుండాపోయింది. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు ఆక్రమణదారులు పాగా వేస్తున్నారు. అది శ్మశానమా, కొండ ప్రాంతమా, పేదల స్థలమా, డీపట్టా సంబంధం లేకుండా ఆక్రమణే లక్ష్యంగా పెట్టుకొని ఆక్రమించుకుంటున్నారు. వీరికి అండగా రెవెన్యూ అధికారులే సహాయ సహకారాలు అందిస్తున్నారనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. రోజుకు రోజుకూ భూ ఆక్రమణలు పెరుగుతున్నా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడమే దీనికి నిదర్శనం. కాశీబుగ్గ సూదిొండ వెనుక భాగంలో సర్వే నంబరు 51లో అర ఎకరానికి పైగా యథేచ్ఛగా ఆక్రమించుకున్నారు. అక్కడతో ఆగకుండా సొంత స్థలంలా పునాదులు వేసి పోల్స్‌ను పాతారు. మరోచోట స్థలానికి చుట్టూ కంచె కూడా వేశారు. కోట్ల విలువ చేసే స్థలం ప్రయివేట్ వ్యక్తులు ఆక్రమమించుకుంటున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రాంతంలో ప్రభుత్వ అనుమతులతో కంకర తవ్వేందుకు వైసిపి నాయకుడు కంకర క్వారీ పెట్టారు. అయితే ఆయనకు కీలక నేత మధ్య వ్యత్యాసం రావడం, సూదికొండ ప్రాంత వాసులు క్వారీ నడపం వల్ల ప్రజలు తీవ్రస్థాయిలో వ్యతిరేకించారు. అప్పటి నుంచి క్వారీ నిలిచిపోగా ఆ సమయంలో క్వారీ కోసం చేసే రహదారి సైతం ఆక్రమించుకోవడం విశేషం. ఇదిలా ఉండగా, మాజీ ఎమ్మెల్యే రేవతిపతి హయాంలో కొండ ప్రాంతంలో భూగర్భ జలాలు పెంచేందుకు బంద కూడా తవ్వారు. కొండ ప్రాంతంతో పాటు బందనూ ఆక్రమిస్తున్నట్లు ఆరోపణ వినిపిస్తున్నాయి. ఏదేమైనప్పటికీ ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురి కావస్తున్నా అధికారులు పట్టించుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ విషయంపై ఆర్‌డిఒ సీతారామమూర్తిని వివరణ కోరగా, సూదికొండ ప్రాంతంలో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందనే విషయం మా దృష్టికి రాలేదన్నారు. తక్షణమే అధికారులతో పరిశీలించి ఆక్రమణ తొలగిస్తామని చెప్పారు.


ఆక్రమించుకున్న క్వారీ రహదారి


కొండపై వేసిన పునాదులు

ఇసుక లారీలతో ఇబ్బందులు

ప్రజాశక్తి- బూర్జ

నారాయణపురం ఆనకట్టకు సంబంధించి సంతకమిటి మండలం తమరాం నుంచి ఇసుకను నిత్యం వందలాది లారీలతో విశాఖపట్నం, ఒడిశా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ లారీలు మండలంలోని నారాయణపురం నుంచి లాభాం, చీడివలస, కొల్లివలస మీదుగా లారీలు రాకపోకలు సాగిస్తుండడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా లారీలో ఉన్న ఇసుకపై టార్పాలిన్లు కట్టకుంటా తరలిస్తున్నారు. లారీలు వేగంగా వెళ్లడంతో అందులో నుంచి ఇసుక, దుమ్ము, ధూళి వెనుక రేగుతుంది. దీంతో వెనుక వస్తున్న ద్విచక్ర వాహనదారులు, ఆటోలో ప్రయాణికులు, పాదచారులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. వారి కళ్లల్లో ఇసుక రేనువులు పడడంతో మరింత అవస్థలకు గురవుతున్నారు. కనీస నిబంధనలు పాటించకపోవడంతో రోజూ ఏదో ఒక చోట చిన్న, పెద్ద ప్రమాదాలు సంభవిస్తున్నానే ఉన్నాయి. ఆలాగే ఒక్కసారిగా లారీలు రావడంతో రోజూ కొల్లివలస కూడలి వద్ద ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఉదయం, సాయంత్రం అయితే గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఈ విషయం స్థానిక నాయకులకు, అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.


బ్రిడ్జిపై నిలిచిన వాహనాలు


దంతాలను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

దంతాలపై అప్రమత్తం

ఆమదాలవలస : పట్టణంలోని బి.ఆర్.నగర్‌లో పొన్నాడ అప్పల నరసమ్మ - చిన్నవాడు సేవా సంస్థ నిర్వహణలో పొన్నాడ వరాహ నరసింహం మాస్టారు ఆధ్వర్యాన కెవికె దంత వైద్యశాల వైద్యులు డాక్టర్ కూన రాఘవనాయుడు, చాపర అనూష పర్యవేక్షణలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. దంత సమస్యలు ఉన్న సుమారు 50 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. దంత వ్యాధుల నివారణకు తగు సూచనలు, సలహాలను అందజేశారు. ఆరోగ్యకరమైన దంతాలు ఆరోగ్యవంతమైన జీవితాన్ని ఇస్తాయన్నారు. కార్యక్రమంలో మొదలవలస రమేష్, గురుగుబెల్లి మోహనరావు, పి.విజయ్ కుమార్, ఎన్ని లక్ష్మీనారాయణ, చిగిలిపల్లి ఆదినారాయణ, కర్నేన జనార్ధనరావు, పూజారి నరసయ్య, పేడాడ సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి వాకర్స్ సంస్థల తోడ్పాటు

వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమాజంలో నివసించే అందరి ఆరోగ్యానికి ఎంతో రక్షణగా నిలిచే సంస్థలు వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్ మాత్రమేనని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎం.వి.నేతాజీసుబ్బారెడ్డి అన్నారు. నగరంలోని ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన వాకర్స్ ఇంటర్నేషనల్ 102 కాన్ఫరెన్స్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అంతర్జాతీయ వాకర్స్ సేవా సంస్థలో సభ్యత్వం పొంది, మన ఆరోగ్యం కాపాడుకుంటూ, సమిష్టిగా అవసరమైన వారికి సేవలందించే భాగ్యం ఒక్క వాకర్స్ క్లబ్ ద్వారానే సాధ్యమన్నారు. 1986లో విశాఖపట్నంలో స్థాపించిన వాకర్స్ సంస్థలు ఇతర దేశాలకు వ్యాపించాయని, ఇది మనకు ఎంతో గర్వకారణం అన్నారు. సమాజంలో అవసరమైన ప్రజలకు సేవలు అందిస్తూ, స్వచ్ఛంద సంస్థలకు ధీటుగా నడక సంఘాలు ముందుకు సాగుతున్నాయని అన్నారు. మహాత్మాగాంధీ ఫెలోషిప్ ద్వారా శాశ్వతమైన సామాజిక సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ కాబోయే ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.పి.నరేంద్ర, ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఐ.గుంనేశ్వరరావు, వాకర్స్ గవర్నర్ గుప్తా, ఎస్.జోగినాయుడు, జి.ఇందిరాప్రసాద్, పి.ఉమామహేశ్వరరావు, ఎస్ఎస్ఎస్ఎస్ రాజు,సినీ నటుడు బి.పేర్రాజు పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన వాకర్సుకు దుశ్శాలు కప్పి సన్మానించారు.



మాట్లాడుతున్న నేతాజీ సుబ్బారెడ్డి


ఆర్థికసాయం అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

కిడ్నీ రోగికి ఆర్థికసాయం

పలాస: మందస మండలం సొండిపుడి గ్రామం నిరుపేద కుటుంబానికి చెందిన ప్రశాంత్ పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తి చేసి చిరు ఉద్యోగం చేసుకుంటూ తన కుటుంబన్ని పోషించుకుంటున్నాడు. ప్రశాంత్ తన తండ్రిని కోల్పోయిన అతి కొద్ది రోజుల్లోనే తనకి కిడ్నీ వ్యాధి అని తెలిసింది. ప్రస్తుతం డయాలసిస్ చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న కాశీబుగ్గ ఎస్‌పివి గ్రూప్ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సమాజ సేవకులు మాన్యయాల శ్రీనివాసరావు, అయ్యప్ప స్వామిలు రూ.26 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.


జి.సిగడాం : దుప్పట్లను పంపిణీ చేస్తున్న అప్పలనాయుడు

బాధితులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి- జి.సిగడాం

మండలంలోని మర్రివలసలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. దీంతో బాధితులు నిరాశ్రయులయ్యారు. విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు లుకలాపు అప్పలనాయుడు శనివారం పరామర్శించారు. ఈ ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుని ప్రభుత్వం తరుపున అన్నివిధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆ బాధిత కుటుంబాలకు భరోసా కల్పించి ఆర్థిక సాయంగా బియ్యం ప్యాకెట్లు, దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విక్రం కోటిబాబు, పలిశెట్టి రమణ, విక్రం నారాయణరావు, రధానందం, దన్నాన సత్యంనాయుడు, తరిగొప్పుల శ్రీనివాసరావు, లింగాలవలస బూత్ కమిటీ కన్వీనర్ మీసాల నారాయణరావు, పతివాడ గురునాయుడు, గొర్లె సూర్యనారాయణ పాల్గొన్నారు.


మెళియాపుట్టి : సామగ్రిని అందజేస్తున్న సంజీవరావు

బాధితులకు సహాయం

మెళియాపుట్టి : మండలంలోని ఎగువ బందపల్లి అగ్నిబాధిత కుటుంబాలను శనివారం రాత్రి సృజన సంజీవ ఫౌండేషన్ ఆదుకుంది. ఈ మేరకు దుస్తులు, భోజనం ప్లేట్లు, బియ్యం అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ లింగాల సంజీవరావు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి ఫౌండేషన్ తరపున సహకారం అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, సర్పంచ్ ప్రతినిధి పాపారావు తదితరులు పాల్గొన్నారు.


పలాస : పరామర్శిస్తున్న భవానీశంకర్

భవానీశంకర్ పరామర్శ

ప్రజాశక్తి- పలాస

పలాస ప్రభుత్వాస్పత్రుల్లో గైనిక్‌గా పనిచేస్తున్న వైద్యులు లక్ష్మీప్రసన్నను ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బింగ్ భవానీశంకర్ ఆదివారం పరామర్శించారు. నందిగామ మండలం పెద్దినాయుడుపేట కూడలి వద్ద ఇటీవల సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఆమె భర్త, పలాస ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మడే రమేష్, తన కుమారుడు మృతి చెందిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో లక్ష్మీప్రసన్న, ఆమె కుమార్తె తీవ్రంగా గాయపడి శ్రీకాకుళం మెడికేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారు ఇప్పుడిప్పుడు కోలుకుంటున్నారు. దీంతో ఇద్దరినీ భవనీశంకర్ పరామర్శించి యోగా క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని కోరారు. ఆయనతోపాటు మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రతినిధి కోటి దుర్గాప్రసాద్, కౌన్సిలర్ సమరసోమేశ్వరరావు ఉన్నారు.

తేజేశ్వరరావు...

కొత్తూరు : మండలంలోని కర్లెమ్మ పంచాయతీ నేతజీనగర్ కాలనీకి జిల్లా వ్యవసాయ వ్యవసాయ సలహా మండలి సభ్యులు లోతుగెడ్డ తిరుపతిరావు కుమారుడు రవి కిషోర్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ నాయకులు సిరిపురం తేజేశ్వరరావు ఆదివారం తిరుపతిరావును పరామర్శించారు. ఈయన వెంట పి.కేశవరావు, రవికుమార్, కె.జగదీష్ ఉన్నారు.


సందడి చేస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సందడి

ప్రజాశక్తి- పొందూరు

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1988-89లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక పిట్టావారి తోటలో వనభోజన కార్యక్రమంలో సందడి చేశారు. 120 మంది విద్యార్థులు 33 సంవత్సరాలు తరువాత ఒక్కచోట కలియడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఆప్యాయంగా పలకరించుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ పులకించిపోయారు. గతించిపోయిన ఉపాధ్యాయులు మజీనా, శేషాచార్యులు, రుప్ప అప్పన్న, పూర్వ విద్యార్థి మలిపెద్ది రామకృష్ణలకు రెండు నిముషాలు పాటు మౌనం పాటించి సంతాపం తెలియజేశారు.

సిమెంట్ షాపులో పాము కలకలం

బూర్జ : మండలంలోని కొల్లివలసలో ఉన్న ఓ సిమెంట్ షాపులో ఆదివారం నాగ జెర్రీ కలకలం రేపింది. సత్యనారాయణ సిమెంట్ షాపు యజమాని తెరిచి చూడగా అందులో కనిపించింది. స్థానికులు పామును దూరంగా వెంటబెట్టారు.


ఎలుకను తింటున్న పాము

మోడల్ స్కూల్ విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్రస్థాయి సైన్స్ ప్రతిభ అన్వేషణ కౌశల్-2022 పోటీలకు పొందూరు ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకరరావు తెలిపారు. ఈ నెల 26న ఎచ్చెర్ల మండలంలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లాస్థాయిలో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సైన్స్ పోటీలకు జిల్లాస్థాయిలో 36 పాఠశాలలు పాల్గొనగా, ఎపి మోడల్ స్కూల్ పొందూరు ప్రథమ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సైన్స్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు ఎస్.జనయిత్రి, హెచ్.మౌనిక, జి.అవినాష్, టి.తేజేశ్వని, గైడ్ టీచర్ జీవన్‌బాబులను ప్రిన్సిపాలు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది అభినందించారు.



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ప్రభాకరరావు